ప్రజాశక్తి

ఆదివారం 16 జూన్ 2024

5

విజయనగరం



గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలోని తాటిపూడిలో గల ఎపి బాలికల గురుకుల పాఠశాలలో గెస్ట్ టీచర్(పిజిటి) గా నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జె.ఎన్.సంధ్యాభార్గవి తెలిపారు. ఇంగ్లీషు, గణితం, భౌతిక శాస్త్రం సబ్జెక్టుల్లో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పై సబ్జెక్టుల్లో పిజి, బి.ఎడ్. విద్యార్హత కలిగి బోధనలో అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 19వ తేదీలోగా తాటిపూడిలోని గురుకుల పాఠశాలలో స్వయంగా దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 8712625024 మొబైల్ నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ), సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత, సంబంధాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లాను ప్రగతిపథంలో ముందుకు నడిపిస్తారని ప్రజలంతా ఆశిస్తున్నారు. మంత్రిగా ప్రాతినిధ్యం వహించేది మూడు శాఖలకే అయినప్పటికీ జిల్లా అభివృద్ధికి తీసుకునే ప్రతి నిర్ణయం శ్రీనివాస్ కనుసన్నల్లోనే ఉంటుంది. ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి ముందుకు వెళ్లినా, వెనక్కి తగ్గినా మంత్రిగా ఉన్నన్నాళ్లు శ్రీనివాస్‌దే బాధ్యత. పదికాలాలపాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నికై మరిన్ని శాఖలకు మంత్రి కావాలన్నా ఇదే చక్కటి అవకాశం. చిన్నవయసులోనే వచ్చిన ఈ అవకాశాన్ని శ్రీనివాస్ ఏ విధంగా వినియోగించుకుంటారో? అన్న ఆసక్తికర చర్చ జనంలో విస్తృతంగానే సాగుతోంది. ఈనేపథ్యంలో మంత్రి శ్రీనివాస్ జిల్లాకు తొలిసారిగా వస్తున్న నేపథ్యంలో ప్రజాశక్తి అందిస్తున్న ప్రత్యేక కథనమిది.



కొండపల్లిపై కోటి ఆశలు

- అసలే వెనుకబడిన జిల్లా
- ఆపై పారిశ్రామిక రంగంలో అధమ స్థానం
- ఒడిదొడుకుల మధ్య వ్యవసాయ రంగం
- సేవా రంగమూ అంతంత మాత్రమే
- వనరులకు కొదవలేదు
- మనసు పెడితే ప్రగతి దారులే
- చిన్న వయసులోనే శ్రీనివాస్‌కు అరుదైన అవకాశం



నేడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాక

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఉదయం జిల్లాకు చేరుకుంటారు. మంత్రి పదవి చేపట్టి, జిల్లాకు తొలిసారిగా వస్తున్న శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి శ్రీనివాస్ ఆదివారం ఉదయం విశాఖపట్నంలో 9 గంటలకు బయలుదేరి, 10గంటలకు జిల్లాకు చేరుకుంటారు. ముందుగా పైడితల్లి అమ్మవారి దర్శనం చేసుకుంటారు. టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఉదయం 10.30గంటలకు పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 12 గంటలకు తమ స్వస్థలం గంట్యాడ వెళ్లి, స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అక్కడి నుంచి 12.45 గంటలకు గజపతినగరం వెళ్లి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. గజపతినగరంలో శ్రీనివాస్‌కు ఘనస్వాగతం పలికేందుకు టిడిపి నాయకులు ఏర్పాట్లు చేశారు. అనంతరం విజయనగరంలోని తమ స్వగహానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి జిల్లాపరిషత్ అతిది గృహంలో సందర్శకులను కలుస్తారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం పూర్తిగా వ్యవసాయాధారిత జిల్లా. పెద్దగా పరిశ్రమలు లేవు. సేవారంగం కూడా అంతంతమాత్రమే. ఫలితంగా ఒకప్పటితో చూస్తే గ్రామీణ ముఖచిత్రాలు మారాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో జంఝావతి, నాగావళి, వేగావతి, సువర్ణముఖి, చంపావతి, గోముఖి వంటి ఎన్నో నదులు, జీవగెడ్డలు ఉన్నప్పటికీ సాగునీటి రంగంపై గత పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా సారవంతమైన భూములు సైతం బీడువారాయి. దశాబ్ధాలు గడుస్తున్నా తోటపల్లి, జంఝావతి, రామతీర్థసాగర్, గుర్లగెడ్డ వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో పంటల సాగు అత్యంత కష్టతరంగా మారింది. దీంతో, చిన్నరైతులు, వ్యవసాయ కార్మికులు పొట్ట చేతపట్టుకుని విశాఖ, చెన్నై, విజయవాడ, హైదారాబాద్ వంటి నగరాల్లో కూలిపనులు చేసుకునేందుకు వలస పోతున్నారు.

మరోవైపు జిల్లాలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు అనేక ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నాయి. ఇటీవల చాలా వరకు మూతపడ్డాయి. జిల్లాకు పుట్టినిల్లుగా ఉన్న జ్యూట్ మిల్లులు ప్రభుత్వ విధానాల కారణంగా దాదాపు మాయమయ్యాయి. జిల్లాలో ఉన్న రెండు చక్కెర కర్మాగారాలు (భీమసింగి, లచ్చయ్యపేట ఫ్యాక్టరీలు) గత ప్రభుత్వ హయాంలో మూతపడ్డాయి. దీంతో, చెరకు రైతులతోపాటు అందులో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు కూడా జీవనోపాధి కోల్పోయారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా జిల్లాను సేవారంగంలో ముందుకు నడిపేందుకు గతంలో అనేక ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఆ రకమైన కృషి జరగలేదు. ఇలా పుష్కలమైన సహజ వనరులు, కష్టపడి పనిచేసే మానవ వనరులు ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం, ప్రభుత్వాల చిన్నచూపు వల్ల జిల్లా అన్ని రంగాల్లోనూ వెనుకబడిపోయింది. ఫలితంగా సగటు మనిషి తలసరి ఆదాయం పెరగడం లేదు. కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. ముఖ్యంగా పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం ఏటా తగ్గిపోవడం ఇందుకు తార్కాణం. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ ప్రాతినిధ్య వహించిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు శాఖ ఎంతో ఉపయోగ పడుతుందనడం అతిశయోక్తి కాదు.

జిల్లా భౌగోళికంగా 16, 34, 750 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో వ్యవసాయానికి అనువుగావున్న భూమి 9,25,387.5 ఎకరాల వరకు ఉంది. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలు సాగుచేసేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, మినుములు, పెసలు తదితర అపరాలు వంటి వ్యవసాయ పంటలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కేవలం 5లక్షల ఎకరాలలోపే. ఇందులో అత్యల్పంగా ఉద్యాన పంటల సాగు కేవలం 1,67,902 ఎకరాల్లో మాత్రమే ఉంది. నాన్ ఫుడ్ క్రాప్ ఏరియా కూడా 23,096 (6శాతం) ఎకరాలుగా నమోదైంది. గతంలో పోలిస్తే క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. ఏటా సాగు విస్తీర్ణం కన్నా బీడువారుతున్న సాగుభూములు 2శాతం వరకు ఉండడం గమనార్హం. సుమారు 80శాతం జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, సాగునీటి వసతి కల్పించకపోవడం, ఉద్యాన పంటలను తగినంతగా ప్రోత్సహించకపోవడం, ప్రభుత్వం తరపున బోర్లు, బావులు మంజూరు చేయకపోవడం, మైక్రో ఇరిగేషన్ పథకాలు పూర్తిగా స్తంభించడం వంటి కారణావల్ల సాగు భూమి తగ్గుతోంది. ఉద్యాన ఉత్పత్తులకు స్థానికంగా మార్కెట్ సదుపాయం కల్పించకపోవడం కూడా సాగుభూమి తగ్గుదలకు మరో కారణంగా చెప్పుకోవచ్చు.



అధ్వానంగా తోటపల్లి కాలువ

దీంతో, వ్యవసాయ రంగం ద్వారా జిల్లాకు కేవలం రూ. 13,343 కోట్ల (41.2 శాతం) ఆదాయం మాత్రమే వస్తోంది. ఈ ప్రభావం రైతులతో పాటు వ్యవసాయ రంగంపై ఆధార పడిన కార్మికులు, వృత్తిదారులపైనా పడింది.

జిల్లాలో అనేక జలపాతాలు, ఎత్తైన కొండలు, కోట, గంటస్తంభం వంటి పురాతన కట్టడాలు, దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి మహారాజ సంగీత, నృత్య కళాశాల వంటివి ఉన్నాయి. రామతీర్థం, రామనారాయణం వంటి ఆధ్యాత్మిక కేంద్రాలతోపాటు పురాతన ఆలయాలకు కొదవలేదు. గురజాడ స్మారక భవనం, చాసో స్మారక ప్రాంగణం వంటి మరెన్నో సాహిత్య కేంద్రాలూ ఉన్నాయి. వీటన్నింటినీ పర్యాటకులను ఆకర్షించే విధంగా తయారు చేయడం ద్వారా జిల్లాకు ఆదాయాన్ని పెంచవచ్చు. ఇలా వచ్చిన పర్యాటకులతో జిల్లా వాణిజ్య, వ్యాపారపరంగా మరింత వృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, తలసరి ఆదాయం. కొనుగోలు శక్తి పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

జిందాల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

విశాఖపట్నం ఎమ్‌పి శ్రీభరత్ హామీ

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ పరిశ్రమ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తానని విశాఖపట్నం ఎమ్‌పి ఎం.శ్రీభరత్ హామీనిచ్చారు. శనివారం మండలంలోని జిందాల్ పరిశ్రమ వద్ద కార్మికులు చేపట్టిన నిరసన శిబిరాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఫెర్రో పరిశ్రమలు చాలా ధీన పరిస్థితిలో ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలతో పరిశ్రమలకు విద్యుత్తు ఛార్జీలు గుదిబండగా మారాయన్నారు. రాష్ట్రంలో విద్యుత్తు కొరత ఎక్కువ కావడం, ఛార్జీల భారాల వల్ల నేడు ఫెర్రో పరిశ్రమలు మూత దిశగా పయనిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిందాల్ యాజమాన్యంతో చర్చించి కంపెనీ తెరవడానికి తగిన కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ జిందాల్ కార్మికుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి తీసుకెళ్తానని, రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు. సంబంధిత శాఖా మంత్రి దృష్టికీ సమస్యను తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేవుడు, టిఎన్‌టియుసి నాయకులు పిల్లా అప్పలరాజు, సలాది భీమయ్య, సిఐటియు నాయకులు గాడి అప్పారావు, వైఎస్ఆర్‌టియుసి నాయకులు లగుడు వామాలు, పెదిరెడ్ల ప్రసాద్, నమ్మి చినబాబు, బొట్ట రాము, బాలిబోయిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్‌పి శ్రీభరత్



ఎంఇఒ, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

నైపుణ్యమున్న అధ్యాపకులతో ఇంటర్ విద్య

- కళాశాల ప్రవేశాలపై కలెక్టర్ సీరియస్
- అనుమతుల్లేని పాఠశాలలకు నోటీసులివ్వాలని డిఇఒ ఆదేశం
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - జామి

జామి హైస్కూల్లో ఈ ఏడాది నుంచి ఇంటర్ చదువులు ప్రారంభమైన తరుణంలో నైపుణ్యం కలిగిన అధ్యాపకులను నియమిస్తున్నామని డిఇఒ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ప్రతి విద్యార్థికీ మెరుగైన ఇంటర్ చదువులు అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల అధికారులను ఆయన ఆదేశించారు. 'కళాశాల చదువుకు ఆదిలోనే అడ్డు' అన్న శీర్షికతో 'ప్రజాశక్తి'లో శనివారం ప్రచురించిన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. జామి హైస్కూల్‌ను పరిశీలించాలని డిఇఒను ఆదేశించారు. దీంతో ముందుగా డిఇఒ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రెహమాన్ సమక్షంలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఇంటర్ ప్రవేశాలకు కలిగిన ఆటంకాలు తెలుసుకున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, కాలేజీలో చేరేలా చూడాలని ఆదేశించారు. మెరుగైన అధ్యాపక బృందాన్ని ఏర్పాటు చేస్తామన్న నమ్మకాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులకు కలిగించే బాధ్యత మనపైనే ఉందన్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సహకారంతో ప్రతిఒక్కరూ కష్టబడి ఇంటర్ చదువులు అభివృద్ధి చేసేలా పని చేయాలని ఆదేశించారు.

అనుమతుల్లేని ప్రయివేటు బడులపై చర్యలు తీసుకోవాలి

జామి మండలంలో అనుమతులు లేని ప్రయివేటు బడులపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ ప్రేమ్‌కుమార్‌కు వినతి అందజేశారు. ప్రయివేట్ పాఠశాలల వల్ల ప్రభుత్వ విద్య ప్రజలకు దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన డిఇఒ మండలంలోని అన్ని ప్రయివేటు బడులను నోటీసులు ఇచ్చి, రికార్డులు పరిశీలించాలని ఎంఇఒ జయశ్రీని ఆదేశించారు. వినతి అందించిన వారిలో ఎం.తాతంనాయుడు, వాసుదేవరావు, తదితరులు ఉన్నారు.

స్పందన పేరు మార్పు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం పేరు మారింది. ఇకనుంచి ఈ కార్యక్రమాన్ని పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసిల్ సిస్టమ్‌గా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

అప్రెంటీస్‌కు 33 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని విటి అగ్రహారంలో గల ప్రభుత్వ ఐటిఐలో శనివారం మేదో సర్వోషిప్ క్యాంపస్ డ్రైవ్‌లో 33 మంది ఎంపికయ్యారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ జి.రామాచారి, ఇతర సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇప్పటికే ఐటిఐ ట్రేడ్‌లు పాసైన వారు, 2024 విద్యా సంవత్సరం ట్రైనింగ్ పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు కూడా ఈ క్యాంపస్ డ్రైవ్ లో అప్రంటేస్‌కు ఎంపికయ్యారు.



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు

జాబ్‌మేళాకు 89 మంది హాజరు

జాబ్ డీలర్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం జిల్లా ఉపాధి కల్పనాశాఖ అధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటిఐలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు 89 మంది హాజరయ్యారు. వీరిలో 42 మందిని తదుపరి రౌండ్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ, ఎఎంలు కె.రామచంద్రరావు, కె.లక్ష్మణరావు, హెచ్‌ఆర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

కార్యదర్శికి మెమో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 25వ నెంబర్ సచివాలయ అడ్మిన్ కార్యదర్శి శ్యాంసుందర్ కు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమల రావు ఛార్జ్ మెమో జారీ చేశారు. శనివారం ఆయన సచివాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు ,ఫిర్యాదుల పట్టికలు, రికార్డులను పరిశీలించారు. అడ్మిన్ కార్యదర్శి శ్యాంసుందర్ సమాచారం లేకుండా విధులకు గైర్హాజర య్యారని గమనించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన సదరు కార్యదర్శికి ఛార్జ్ మెమో జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సచివాలయ కార్యదర్శులు కృషి చేయాలని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శులు పట్ల ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ అదనపు గణాంక అధికారి సీతారామమూర్తి పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సహాయ కమిషనర్ తిరుమలరావు

మెగా డిఎస్‌సితో విద్యా ప్రమాణాలు మెరుగు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నూతనంగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయడం శుభ పరిణామమని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 117 జీవో రద్దు చేయాలని, రద్దు అయిన హెచ్‌ఎం పోస్ట్ లు పునరుద్ధరించాలని కోరారు. డిఎస్‌సి కంటే ముందుగానే ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. డిప్యూటీ డిఇఒ పరీక్షలో 1:100 పద్ధతిలో మెయిన్ పరీక్షకు ఎంపిక చెయ్యాలని కోరారు. ప్రైమరీ స్కూల్‌కి హెచ్‌ఎం, ఎల్‌ఎఫ్‌ఎల్ హై స్కూల్లో లో గ్రేడ్ -2 హెచ్‌ఎం, గ్రేడ్-1 ప్రిన్సిపల్స్, డిప్యూటీ డిఇఒ పోస్టులు క్రియేట్ చెయ్యాలని కోరారు.

జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 17న నిర్వహించే బక్రీద్ పండగ సందర్భంగా జిల్లాలో అక్రమంగా పశు వధ, అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలను తీసుకుంటామనిజిల్లా పశు సంవర్థకశాఖాధికారి డాక్టర్ ఎ.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రతీఒక్కరూ తప్పనిసరిగా జంతు సంక్షేమ చట్టాలను పాటించాలని కోరారు. జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని పశు సంవర్థక శాఖాధికారులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు దృష్టి సారించాలని సూచించారు.

నాణ్యతా లోపాన్ని సహించేది లేదు

కమిషనర్ ఎం.ఎం.నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాన్ని సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు స్పష్టం చేశారు. శనివారం నగరంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పనితీరును పరిశీలించారు. జొన్న గుడ్డి, రాజీవ్ నగర్, అయ్యకోనేరు గట్టు తదితర ప్రాంతాలలో నిర్మాణంలో ఉన్న రహదారులు, కల్వర్టు పనులను, పారిశుధ్య పనులు పరిశీలించారు. జొన్న గుడ్డిలో అర్బన్ హెల్త్ సెంటర్ మరమత్తులు, టైల్స్ ఏర్పాటు పనులు, రూఫ్ షీట్ పనులను పరిశీలించారు. తర్వాత రాజీవ్ నగర్ కాలనీలో సిసి డ్రైన్ పనులను చూశారు. పనులు త్వరగా పూర్తి కావాలని సిబ్బందికి ఆదేశించారు. పనులు వేగవంతంతో పాటు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అయ్య కోనేరు గట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. పూడికలు తొలగించాలని అక్కడున్న పారిశుధ్య పర్యవేక్షకులకు సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఎఇ పార్వతి, పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, సలీం రాజ్, అంజిబాబు పాల్గొన్నారు.




పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నమ్మకం నిలబెట్టుకుంటేనే..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో టిడిపి ఎమ్మెల్యేలంతా భారీ మెజార్టీలతో గెలిచారు. రాష్ట్ర రాజధానిలో జరిగిన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి, ఎన్‌డిఎ సమావేశానికి వెళ్లి వచ్చారు. ఇలా వచ్చారో లేదో ఓట్లేసి గెలిపించిన జనమే మురిసిపోతూ పుష్పగుచ్చాలు, సాలువాలతో సత్కరించేందుకు తండోపతండాలుగా తరలి వెళ్లారు. అన్ని నియోజక వర్గాల్లోనూ ఇటువంటి సందడి కనిపిస్తోంది. కానీ, ఈ హడావుడి ఏమీ కొత్తకాదు. తాము నమ్ముకున్న, ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను గౌరవించడమంటే తమ ఆకాంక్షలను, ఆశలను తీరుస్తారనే నమ్మకం పెంచుకోవడమే. ఈ నమ్మకాన్ని ప్రస్తుత ఎమ్మెల్యేలు నిలబెట్టుకుంటారా? లేదా? అన్నదే కొద్దిరోజులుగా వినిపిస్తున్న పబ్లిక్ టాక్. ఇందుకు కారణం లేకపోలేదు. కారణాలు ఏవైనా గతంలో గెలిచిన ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు. ఎంతసేపూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనే లెక్కల్లో చూపించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఏమాత్రం చొరవ చూపలేదు సరికదా? నేల విడిచి సాము చేసినట్టు ఓట్లేసిన జనాన్ని వదిలేసే వ్యాపారులు, పెట్టుబడిదారులు, మధ్యవర్తులు లాభపడే విధంగా వ్యవహరించారు. బొబ్బిలిలో మూతపడిన శ్రీనివాస జ్యూట్‌మిల్లును తెరిపిస్తామంటూ హామీ ఇచ్చిన గత ఎమ్మెల్యే అదే జ్యూట్ మిల్లును రియల్ ఎస్టేటర్ల పరం చేశారు. తోటపల్లి నీరు రప్పించేందుకు బ్రాంచికెనాల్ ఏర్పాటు చేసి తీరుతామని



చెప్పినప్పటికీ నెరవేర్చలేదు. కురుపాంలో పూర్ణపాడు - లాబేసు వంతన నిర్మాణం పూర్తిచేస్తామని చెప్పిన పుష్పశ్రీవాణి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. గజపతినగరం నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే అప్పలనర్సయ్య మరో అడుగు ముందుకువేసి ప్రభుత్వ, ప్రైవేటు భూములు వశపర్చుకోవడం వంటి వాటికి యథేచ్ఛగా పాల్పడ్డారు. ఓట్లేసిన ప్రజలతోపాటు ఆయన గెలుపునకు కృషిచేసిన నాయకులను కూడా పట్టించుకోలేదు. కలిసి తమ సమస్యలు చెప్పుకునేందుకు కూడా సమయం ఇవ్వలేదు. పార్వతీపురం తదితర నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. మరో మాటలో చెప్పాలంటే జనాన్ని డబ్బులతో కొనుగోలు చేయవచ్చనే ధోరణిలోకి వెళ్లిపోయారు. ఇలా ఉమ్మడి విజయనగరం జిల్లాలో అన్ని చోట్లా అదే పరిస్థితి ఉండడం వల్ల వైసిపి ఎమ్మెల్యేలంతా ఓడిపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యేలు ఆవిధంగా మారబోరనే ఆశ ప్రజల్లో ప్రస్తుతం ఉంది. ఇచ్చిన హామీలను కూడా నెరవేరుస్తారన్న ఆశలు ప్రగాఢంగా ఉన్నాయి. అదే నమ్మకంతో పనిచేసి ప్రజాసమస్యలపైనా, గ్రామాల అభివృద్ధిపైనా దృష్టిపెడితేనే తిరిగి మళ్లీ ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా కొనసాగే అవకాశం ఉంటుంది. తమ అభీష్టాలకు అనుగుణంగా, అభివృద్ధికి పాటుపడుతూ ముందుకు సాగాలని జనం చర్చించుకుంటున్నారు. ఆ నమ్మకాన్ని ఎమ్మెల్యేలు నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.


వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కరరావు

వ్యాక్సినేషన్ పరిశీలన

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని పొల్లంకి గ్రామంలో శనివారం బిసిజి వ్యాక్సినేషన్ ప్రక్రియను డిఎంహెచ్ఒ భాస్కరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ఇక నుంచి సోమ, గురువారాల్లో వ్యాక్సిన్ వేయాలని సూచించారు. అనంతరం గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇహెచ్ఆర్ నమోదు గురించి రోగులను ఆరాతీశారు. మందుల నిల్వలను తనిఖీ చేశారు. బిసిజి వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించి, వంద శాతం టీకాలు వేసేలా చూడాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పెదమజ్జిపాలెం, గంట్యాడ పిహెచ్‌సిల వైద్యాధికారులు పల్లవి, బి.హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న ముల్లు రమణ

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని రామాంజనేయ కాలనీకి చెందిన మీసాల సరోజినికి ఇంటి నిర్మాణం కోసం శ్రీ దుర్గా మల్లేశ్వ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు, టిడిపి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు ముల్లు రమణ ఆర్థిక సహాయాన్ని అందించారు. మీసాల సరోజిని ఇంటిని నిర్మించుకుంటున్నానని ముల్లు రమణ స్పందించి పది బస్తాల సిమ్మెంటుతో పాటు మూడు వేల ఐదు వందల రూపాయలను సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కెఎం, నిసాన చిరంజీవి, పసుపు రెడ్డి రమణ, గవిడి రామారావు, రెడ్డిపల్లి నరసింహమూర్తి, నీసాన శాంతి, దత్తి అశోక్ బాబు, అలజంగి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ వర్ధంతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండగుంపాం గ్రామంలో ప్రజా కవి శ్రీశ్రీ 41వ వర్ధంతి వేడుకలు శనివారం సిపిఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ సామాజిక రుగ్మతలు రూపు మాపడానికి తన కవిత్వం ద్వారా సమాజాన్ని మేల్కొలిపిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి.సూర్యారావు, బి.సత్యనారాయణ, ఎం. రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాచ్‌మేన్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనారోగ్యంతో ఇటీవల కన్నుమూసిన గ్యాస్ గోడౌన్ వాచ్‌మేన్ పుల్లేల వెంకటరమణ కుటుంబానికి జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘ సమైక్య తరుపున టివి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు రాంకుమార్ , కోశాధికారి కూరెళ్ల సరోజ,రమేష్, మల్లీశ్వరి మరియు సంఘ సభ్యుల ఆర్థిక సహకారాలతో ఈ మొత్తాన్ని అందజేశారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని తీర ప్రాంతమైన ముక్కాం ఉన్నత పాఠశా లలో ఎనిమిదవ తరగతి చదువుతున్న బొడ్డు లక్ష్మి ఎన్ఎన్ఎంఎస్ ఉపకార వేతనానికి ఎంపికైంది. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ఆమెకు నాలుగు సంవత్సరాల పాటు ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనం అందనుంది. ఈమె ఎంపిక పట్ల పాఠ శాల ప్రధానోపాధ్యాయులు జి.నర్సింగరావు, మండల విద్యాశాఖ అధికారులు రమణమూర్తి, చంద్రమౌళి, సిఆర్‌పి శేషుబాబు, పాఠశాల ఉపాధ్యాయులంతా ఆమెను అభినందించారు.


రక్తదానం చేస్తున్న గెద్ద చిరంజీవి

రక్తదానం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా స్థానిక రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో గ్రామీణ వైద్యులు స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. 15వ సారి రక్తదానం చేయడం చాలా ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక రోజున రక్తదానం చేసే అలవాటు చేసుకోవాలని రెడ్ క్రాస్ కార్యదర్శి కె.సత్యం అన్నారు. జోనల్ సలహాదారులు మమ్ముల తిరుపతి రావు చేతులు మీదుగా రక్త దాతలకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త అబ్దుల్ రావూఫ్, సంఘం ప్రతినిధులు భవాని, సీతారాం, ఆదినారాయణ పాల్గొన్నారు.

రూ.10 లక్షలు బీమా అందజేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తపాలా శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ కింద ప్రమాద బీమా పరిహారం రూ.10 లక్షల చెక్కును విజయనగరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. విజయనగరం ఈస్ట్ సబ్‌డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో మృత్యు వాత పడితే ఆ లోటు తీర్చలేనిదని అన్నారు. ఆ కుటుంబాల వేదన వర్ణనాతీతమని, కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా తీసుకోవాలని సూచించారు. ఎసి రిపేరు వర్కర్ ఎలమంచిలి శ్రీను ఇటీవల విద్యుత్తు షాక్‌తో మృతి చెందడంతో నామినీ అయిన అతని భార్యకు రూ.10 లక్షలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్ సబ్ డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ సుందర్ నాయుడు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ సతీష్, బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ జోనల్ మేనేజర్ మురళీ పాల్గొన్నారు. ఈ పాలసీలు తీసుకోవాలంటే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐ పి పి బి) లో ఖాతా ప్రారంభించాలని, తపాలా శాఖ కార్యాలయం లో ఎక్కడైనా ఈ పథకంలో చేరవచ్చని తెలిపారు.

అభివృద్ధే ప్రధాన అజెండా

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర అభివృద్ధే ప్రధాన అజెండాగా తమ ప్రభుత్వం పని చేస్తుందని గిరిజన సంక్షేమ, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సైకో పాలన పోయిందని, సైకిల్ పాలన మొదలైందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల అమలుపై సిఎం చంద్రబాబు నాయుడు సంతకాలు చేసినట్లు చెప్పారు. నిరుద్యోగులకు హామీ ఇచ్చిన విధంగా సుమారు 16వేల పోస్టులతో మెగా డిఎస్సీపైనా, వృద్ధులకు రూ.4వేల పింఛను అమలుపై కూడా సంతకం చేసినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చెప్పారు. 164 స్థానాల్లో విజయం సాధించడం టిడిపి స్థాపించిన తొలినాళ్లలో కూడా జరగలేదని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉత్తమ పాలన అందిస్తామని చెప్పారు. జులైలో పింఛనుదారులకు మొత్తం రూ.7వేలు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జి.సంధ్యారాణి

అందజేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రతి టిడిపి కార్యకర్త లబ్ధిదారులకు దగ్గరుండి అందజేయా లన్నారు. ఏజెన్సీలో గిరిజనులకు డోలీమోతలు లేకుండా చూస్తామన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందజేసేలా చూస్తా నన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఎఎన్ఎంల నియామకం చేపడతామని చెప్పారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటా మని చెప్పారు. కొటియా గ్రామాల వివాదం కోర్టులో ఉందన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్లనే ఒడిశా అధికారులు, ప్రజాప్రతి నిధులు కొటియా గ్రామాల్లోకి చొరబడి దౌర్జన్యం చేశారని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందు బాటులో వుంటానని చెప్పారు. ముఖ్యంగా మహిళలు, గిరిజనులు ఎప్పుడైనా తన వద్దకు వచ్చి సమస్యలు చెప్పుకోవచ్చునని చెప్పారు. తనకు ఇష్టమైన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవి దక్కుతుందని ఆశించానని, అయితే మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి పదవిని ఊహించ లేదని అన్నారు. రాష్ట్రంలోని నిరుపేద మహిళలు, పిల్లలకు పౌష్టికా హారం అందించడానికి కృషి చేస్తానని చెప్పారు సమావేశంలో సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, జి.వేణు గోపాలరావు, పిన్నింటి ప్రసాద్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి ముఖీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణికి అభినందనలు

మంత్రి సంధ్యారాణిని జిల్లా వ్యవసాయశాఖఅధికారి కె.రాబర్ట్ పాల్, సాలూరు ఎడిఎ మధుసూదనరావు, ఎఒ అనూరాధ పండా, వ్యవసాయ శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు.

క్వారీ సమస్యపై మాట్లాడుతా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- భోగాపురం


ఎమ్మెల్యేకు క్వారీని చూపుతున్న గ్రామస్తుడు

క్వారీ వ్యవహారంపై అధికారులతో మాట్లాడుతానని ఎమ్మెల్యే లోకం మాధవి రామచంద్ర పేట గ్రామస్తులకు తెలిపారు. ఈ గ్రామ సమీపంలో జిఎంఆర్ సంస్థ గత రెండు రోజుల నుండి క్వారీ పనులు చేస్తుండగా గ్రామస్తుల అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా క్వారీని జిఎంఆర్ సంస్థ గ్రామ సమీపంలో ఏర్పాటు చేయడం వలన రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు పడతామని ఆమెకు గ్రామస్తులు శనివారం క్యాంప్ ఆఫీస్ లో కలిసి వివరించారు. ఇప్పటికే ఉన్న క్వారీల వలన పేలుళ్లతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. దీనిపై ఆమె స్పందించి నేరుగా గ్రామానికి వెళ్లి జిఎంఆర్ సంస్థ కొత్తగా ఏర్పాటు చేసిన క్వారీని పాఠశాల వద్ద నుంచి పరిశీలించారు. దీనిపై జిల్లా ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి అనుమతులు ఏ విధంగా ఇచ్చారో పరిశీలిస్తామని తెలిపారు. అధికారులను ఇక్కడకు రప్పించి సమస్యను పరిష్కరించే దిశగా మాట్లాడుతానని తెలిపారు.

ఎమ్మెల్యేకు పశుసంవర్థక శాఖాధికారుల అభినందన

నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవిని పశుసంవర్ధక శాఖకు చెందిన జిల్లా అధికారులతో పాటు నియోజకవర్గంలోని వైద్యాధికారులు శనివారం అభినందనలు తెలిపారు. ముంజేరు సమీపంలోని మిరాకిల్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఏ విశ్వేశ్వరరావు, డివిజనల్ ఉపసంచాలకులు వైవి రమణ, సహాయసంచాలకులు చక్రవర్తి, మహాపాత్రో, నాలుగు మండలాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు. రైతులకు అందుబాటులో ఉండి పశువులకు వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆమె వారికి సూచించారు.

చెరువుల ఆక్రమణపై కోర్టులో కేసు

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-బొబ్బిలి



సమావేశంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి లక్ష్మునాయుడు

మున్సిపాలిటీలో చెరువుల ఆక్రమణపై కోర్టులో ప్రజా వాజ్యం కేసు వేసేందుకు ప్రజా సంఘాలు తీర్మానించాయి. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు మాట్లాడుతూ పట్టణంలో చెరువుల ఆక్రమణకు గురవుతున్నా నివారణకు అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. చెరువులు ఆక్రమణకు గురికావడంతో భూగర్భ జలాలు అడుగంటి భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మ నాయుడు మాట్లాడుతూ చెరువుల ఆక్రమణపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువుల ఆక్రమణపై ఎందుకు పట్టించుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న మాట్లాడుతూ చెరువుల ఆక్రమణలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉండటంతోనే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెరువుల ఆక్రమణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేయాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం మాట్లాడుతూ చెరువుల ఆక్రమణతో రైతులకు సాగునీరు అందకపోవడంతో పంటలు పండక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం చెరువుల ఆక్రమణపై కోర్టులో న్యాయ పోరాటం చేయాలనిప్రజా సంఘాల నాయకులు తీర్మానించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు డి.సురేష్, సిఐటియు నాయకులు ఎ.సురేష్ పాల్గొన్నారు.

జనసేన మండలాధ్యక్షుడిని కలిసిన కార్యదర్శులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

జనసేన మండల అధ్యక్షులు జలపారి అప్పడుదొర (శివ)ను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు శనివారం తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన ఎమ్మెల్యేగా లోకం మాధవి విజయం సాధించిన నేపథ్యంలో కార్యదర్శులంతా ఆయన్ను కలసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని కార్యదర్శులందరినీ పరిచయం చేసుకున్నారు. అనంతరం పంచాయతీల్లో తాగునీరు, వీధిలైట్లు, పారిశు ద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే మాధవి ఇప్పటికే అందరికి చెప్పారని గుర్తు చేశారు. మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజలకు మంచి పాలన అందించే విధంగా తోడ్పాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఉమా, సత్యనారాయణ, పద్మాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వేపాడలో భారీవర్షం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారి చెరువును తలపించింది. రహదారిపై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడటంతో వర్షపునీరు నిలిచి పోతోంది. దీంతో బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విజయనగరం కోట : నగరంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన స్వల్ప కురిసింది. పలుచోట్ల హోర్డింగ్‌లో విరిగిపోయాయి.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఇఒ భాస్కరరావు;


రామభద్రపురంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఇఒలు, హెచ్ఎం

విద్యతోనే ఉన్నత శిఖరాలకు..

ప్రజాశక్తి-వేపాడ

విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎంఇఒ బాల భాస్కరరావు తెలిపారు. శనివారం మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ప్రపంచ బాలికల దినోత్సవాన్ని ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు.

పుస్తకాలు పంపిణీ

సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఇఒ బాలభాస్కరరావు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బిపిఎ రాజు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

రామభద్రపురం : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఎంఇఒలు తిరుమల ప్రసాద్, పెంటయ్య ఆధ్వర్యంలో హెచ్ఎం కామేశ్వరరావు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ కార్యదర్శి మురళీధర్, దాలినాయుడు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శత శాతం స్టూడెంట్ కిట్లు పంపిణీ

నెల్లిమర్ల : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శత శాతం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశామని ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలకు విద్యార్థి కిట్లను పంపిణీ చేశామన్నారు. మండలంలో 73పాఠశాలల్లో 19 ఉన్నత పాఠశాలలు, 4 యుపి, 50 ప్రైమరీ పాఠశాలలకు శత శాతం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశామన్నారు.


ఎమ్మెల్యే బేబినాయనకు అభినందనలు తెలుపుతున్న ఎస్ఐలు, ఎఎస్ఐ

బొబ్బిలి కోటలో సందడి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎమ్మెల్యే బేబినాయనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు క్యూ కడుతున్నారు. శనివారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి, బేబినాయనకు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కోట కళకళలాడింది. ఎమ్మెల్యేను ఎస్ఐ లోవరాజు, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, ఎఎస్ఐ బి.రమణ కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఐసిడిఎస్ పిఒ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించండి

అసెంబ్లీలో విద్యారంగ సమస్యలను ప్రస్తావించాలని ఎమ్మెల్యే బేబినాయనకు ఎపిటిఎఫ్ అకాడమీ కన్వీనర్ జేసీ రాజు, గౌరవాధ్యక్షులు బి.జోగినాయుడు, నాయకులు వినతిపత్రం అందజేశారు. సిపిఎస్ రద్దు, జీవో 117, 11వ పిఆర్‌సి వలన జరిగిన నష్టాలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కారానికి పని కృషిచేయాలని బేబినాయనను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ఎమ్మెల్యేకు ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది.. శనివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కలిసి వినతి అందించారు. మద్యం దుకాణాలను ప్రయివేటుపరం చేస్తామని సోషల్ మీడియాలో వస్తున్న కథనాలతో ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా లలితకుమారి స్పందిస్తూ తమ ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులను ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్ తన కుటుంబంతో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. తమ కుటుంబానికి, పార్టీకి ఎప్పుడూ విధేయులుగా ఉంటున్న కిరణ్, కుటుంబ సభ్యులను లలితకుమారి దంపతులు సత్కరించారు.

పర్యావరణ కార్యదర్శికి అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


కార్యదర్శిని అభినందిస్తున్న రాజేష్

వ్యర్థాలతో వినిమయ వస్తువులను రూపొందిస్తూ ఔరా ! అనిపించేలా వివిధ ఆకృతులు తయారు చేసేందుకు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం కషి చేస్తోంది. కమిషనర్ ఎంఎం నాయుడు రీసైకిల్,రియూస్, రెడ్యూస్ 3ఆర్ అనే విధానంపై ప్రజారోగ్య విభాగం, కార్యదర్శులకు అవగాహన కల్పించి నూతన ఆవిష్కరణలకై పిలుపునిచ్చారు. దీనికి స్పందించిన నగరంలోని 5వ నెంబర్ సచివాలయానికి చెందిన ప్రమీల అనే పర్యావరణ కార్యదర్శి వ్యర్థాలతో వివిధ ఆకతులను తయారు చేసి కమిషనర్‌కు అందించారు. వాటిని చూసిన ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ ప్రమీల ప్రతిభను చూసి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ వ్యర్థాల నుండి వినిమయ వస్తువులు రూపొందించాలని ఇచ్చిన పిలుపునకు కార్యదర్శులు స్పందించి వివిధ ఆకృతులు తయారు చేయడం ఆనందంగా ఉందన్నారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు : కడుబండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వైసిపి కార్యకర్తలు అధైర్య పడద్దని, ప్రజా సమస్యలపై పోరాడేందుకు నియోజక వర్గంలో అందుబాటులోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంతగౌరమ్మపేటలో వైసిపి నాయకులు గోగాడ శ్రీనివాసరావు తండ్రి ఇటీవల మృతి చెందడంతో పెదకర్మ కార్యక్రమానికి కడుబండి హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు వాకాడ రాంబాబు, పోతనపల్లి సర్పంచ్ వెంకట్రావు, రొంగలి నాయుడు, జి.నాయుడు, భూమిరెడ్డి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పసుపాం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పసుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2023 -24 విద్యా సంవత్సరంలో మంచి ప్రతిభను కనబరిచారని హెచ్ఎం ఆర్.నాగేశ్వరావు తెలిపారు. పదో తరగతిలో 89.5 శాతం ఉత్తీర్ణతతో మండలంలోని ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. పాఠశాల నుంచి 11 మంది విద్యార్థులు పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్షను రాయగా అందులో ఎనిమిది మంది విద్యార్థులకు గవర్నమెంట్ పాలిటెక్నికల్ సీట్లు లభించడం సంతోషకరమన్నారు. ఎనిమిది మందిలో ఏడుగురికి జెఎన్‌టియు కాకినాడ రాగా, ఒక విద్యార్థికి ఒంగోలులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీటు దక్కడం ఆనందంగా ఉందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరినీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. నాగేశ్వరరావు తోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులో మరింత మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు విద్యార్థులను అభినందిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

49 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలో బుడతనాపల్లి వెళ్లే మార్గంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 49 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు శనివారం విజయనగరం రూరల్ సిఐ శ్రీనివాస్, గంట్యాడ ఎస్ఐ సురేంద్రనాయుడు వివరాలను వెల్లడించారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి నుంచి గంజాయిని ఆటోలో లక్కిడాం జంక్షన్‌కు తీసుకొచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దమ్ముగూడు మండలం వంతలడుంబు చెట్టుబందకు చెందిన నలుగురు వ్యక్తులకు అందించడానికి డ్రైవర్ ఆటోతో అక్కడికి చేరుకున్నాడు. ఆ నలుగురు వ్యక్తులు సమయానికి రాకపోవడంతో గంజాయితో ఉన్న ఆటోను బుడతనాపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రోడ్డుపై ఉంచాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో అక్కడికి చేరుకుని, ఆటోను తనిఖీ చేవారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, 49 కిలోల గంజాయిని, ఆటోను సీజ్ చేశారు. ఆటోడ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించారు.

సంతపాలెంలో రెండిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని సంతపాలెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గొటివాడ అప్పారావు, గొటివాడ అమ్మతల్లికి చెందిన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. పక్కనే ఉన్న వై.దేముడమ్మ రేకులషెడ్ పాక్షికంగా కాలిపోయింది. శనివారం విశాఖపట్నం ఎమ్‌పి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే లలితకుమారి ఆ గ్రామానికి చేరుకుని, బాధితులను పరామర్శించారు. తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు ఘటన వివరాలను వారి దృష్టికి తీసుకెళ్లగా, బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్‌పి, ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రమేష్, ఎంఆర్ఐ రాజేష్, గ్రామ నాయకులు లాలం అర్జునరావు పాల్గొన్నారు.